క్లుప్తంగా

4న గంగమ్మ ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల గ్రామంలో వెలసిన గ్రామ దేవత (పాత గంగమ్మ) జయంత్యుత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా గంగమ్మ జయంతిని నిర్వహిస్తున్నామని, ఆదివారం ఉదయం అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలతోపాటు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేస్తామని వారు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని కోరారు. రాత్రి భజన కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.

అట్లూరులో వర్షం



కోనరాజుపల్లెలో ఇంటి ముందు రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

అట్లూరు : మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కపోతతో అల్లాడిన జనం సాయంత్రం వర్షం కురవడంతో కొంత వేసవితాపాన్ని చల్లార్చినట్లైంది. గాలివానకు పలు గ్రామాల్లో చెట్లు నేలకొరగగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

వర్షం రాకతో ఊరట

గోపవరం : మండలంలో గురువారం సాయంత్రం 5–30 నుండి రాత్రి 7 గంటల వరకు ఓ మోస్తారు వర్షం కురిసింది. ఎండల తీవ్రత అధికంగా ఉండటం, దీనికి తోడు వర్షం రావడంతో ప్రజలకు ఊరట లభించింది.

నీళ్లు రాలేదని పిర్యాదు చేస్తే నిధులు లేవన్నారు

రాజుపాళెం : తమ వీధిలోని కొళాయిలకు నెల రోజులుగా నీరు రావడం లేదని సంబంధిత పంచాయితీ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తే నిధులు లేవని చెప్పారని రాజుపాలెంకు చెందిన ముదిరెడ్డి పల్లె వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో నీళ్లు రాలేదని ఫిర్యాదు చేస్తే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తమ వీధికి వచ్చి పరిశీలించారని పేర్కొన్నారు. అయితే ఈ విషయాన్ని పంచాయితీ కార్యదర్శికి తెలపగా నిధులు లేక పోవడంతో ఏపని చేయలేమన్నారు. ఈ సమస్యను సంబంధిత శాఖ అధికారులు స్పందించి త్వరలో తమ వీధికి నీరు వచ్చేలా చేయాలని ఆయన కోరాడు.

జిల్లా ఆస్పత్రిలో కోతుల పట్టివేత



సిబ్బంది పట్టుకున్న కోతులు

ప్రొద్దుటూరు : స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఇటీవల జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కోతల వలన రోగులకు ఇబ్బందులు ఎదరవుతున్నాయని ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కోతులను పట్టుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. గురువారం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో 10 కోతులను పట్టుకున్నారు. ఇంకా మిగిలిన కోతులను కూడా పట్టుకుమాని, పట్టణంలో కోతులను పట్టుకుని వాటి బెడదను అరికడతామని కమిషనర్ తెలిపారు.

విభజన హామీలపై నోరు విప్పాలి



మాట్లాడుతున్న నారాయణ

కడప రూరల్: విభజన హామీలపై ప్రధాని నరేంద్రమోదీ నోరు విప్పాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.నారాయణ తెలిపారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అమరావతి శంకుస్థాపన పనులను రెండోసారి ప్రారంభించేందుకు రాష్ట్రానికి వస్తున్నారన్నారు. కడప ఉక్కు పరిశ్రమ, కడప బెంగళూరు రైల్వే పనుల అంశాలపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కోరారు. కడప–బెంగళూరు రైల్వేలైన్ పనులు 20 ఏళ్ల కిందట ప్రారంభించినా పూర్తికాలేదన్నారు. సీఆర్‌వీ.ప్రసాద్, గుర్రప్ప, శ్రీనివాసులు, కృష్ణ, అంజి, నాగేంద్ర పాల్గొన్నారు.

కార్మిక విజయానికి సంకేతం మేడే

- ఘనంగా మేడే ఉత్సవాలు
- రెపరెపలాడిన ఎర్రజెండా



ప్రొద్దుటూరు : మే డే వేడుకలో వైఎస్సార్‌టీయూసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు



ప్రొద్దుటూరు క్రైం : మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్



అట్లూరులో..

ప్రొద్దుటూరు : కార్మికలోకం సాగించిన ఐక్య పోరాటాలతో దక్కిన ఫలితానికి మేడే ప్రతి రూపమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. గురువారం మేడే సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.2లక్షలు ఇవ్వాలని, పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పట్టణ కార్యదర్శి సాల్మన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, పట్టణ కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, కమిటీ సభ్యులు ప్రమీలమ్మ, రమాదేవి, సీతమ్మ, అన్నపూర్ణ, శాంతి, మోహన్, జాకోబ్, ఓబయ్య, నాగేంద్ర, శ్రీకాంత్, సురేష్, రవి పాల్గొన్నారు.

కార్మికులకు ఉపాధి కరువైంది

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులకు ఉపాధి కరువైందని వైఎస్సార్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఖాజాపీర్ తెలిపారు. మే డే సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద గురువారం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖాజాపీర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల ప్రభావం కారణంగా గతంలో కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు లేవన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేసేందుకు పనులు లేక ఉపాధి కోల్పోయారన్నారు. మాజీ అధ్యక్షుడు షేక్షావలి మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, కౌన్సిలర్ పాతకోట వంశీధర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్ యాదవ్, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, బాలాజీ, వెంకటేష్, బీఎస్‌ఆర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెకు సన్నద్ధం కావాలి

దేశ వ్యాప్తంగా ఈనెల 20న సమ్మెకు ఉద్యోగ, కార్మిక వర్గం సన్నద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, సివిల్ సప్‌లై గోడౌన్ వద్ద హమాలి వర్కర్ యూనియన్ రాష్ట్ర నాయకుడు శ్రీరాములు, పవర్ హౌస్ రోడ్డులో విద్యుత్ కార్యాలయం వద్ద ఆదినారాయణరెడ్డి, పుట్టపర్తి సర్కిల్‌లో ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు శివారెడ్డి, జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్ద ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై.హరి, పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఆటో స్టాండ్‌లో దేవరశెట్టి నరసింహ, చెన్నకేశవస్వామి గుడి ఆటో స్టాండ్ వద్ద ఎల్లయ్య, పాత బస్టాండ్ వద్ద బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు యేసోబ్ అరుణ పతాకాలను ఎగురవేశారు. ఏఐటీయూసీ నాయకులు రామకృష్ణ, బి.మధు, చైతన్య, రూబెన్, నిర్మల, మచ్చ శ్రీను, రమణ, నీలకంఠారెడ్డి, గురునాథ్, పీరా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడితే పుట్టగతులుండవు

ప్రొద్దుటూరు క్రైం : కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడిన వారికి పుట్టగతులుండవని సీఐటీయూ నాయకులు తెలిపారు. మేడే సందర్భంగా జిల్లా ప్రభుత్వాసుపత్రి నుంచి శివాలయం సర్కిల్ వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా హాస్పిటల్ వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి మేడేను అడ్డుకోవడానికి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్, కార్పోరేట్లకు కారు చౌకగా అమ్ముతూ ప్రజల ఆస్తిని పెట్టుబడిదారులకు కట్టబెడుతోందన్నారు. కార్మిక చట్టాల రద్దుకు వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్తంగా కార్మికులు సమ్మె కొనసాగిస్తారని చెప్పారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణకార్యదర్శి విజయ్‌కుమార్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవ, ప్రమీలమ్మ, నీతిమ్మ, అన్నపూర్ణ, రమణమ్మ, అంగన్‌వాడి యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడాలి

రాజుపాళెం : కార్మికుల హక్కుల కోసం పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గుర్రం డేవిడ్ రాజ్ పేర్కొన్నారు. మే డే సందర్భంగా గురువారం రాజుపాళెంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలపై దాడి చేస్తూ లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తోందన్నారు. వీఆర్‌ఏలకు పనికి తగ్గ వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అర్హులైన వారిని వీఆర్‌ఓలుగా పదోన్నతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు జయపాల్, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాడుదాం

మైదుకూరు : మే డే స్ఫూర్తితో సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై పోరాడాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, నియోజకవర్గ కార్యదర్శి ఏవీ శివరామ్ అన్నారు. మే డే సందర్భంగా మైదుకూరులో గురువారం యూనియన్ జెండాను వారు ఆవిష్కరించారు. బి.పీరయ్య, ఖాదర్‌బాషా, మాబుహుస్సేన్, చిన్న, అచ్చయ్య, గవ్వల వెంకటసుబ్బయ్య, ఆలీ, సాయి, చంద్ర, బండి రాజా, రమేష్, కమాల్ బాషా, శ్రీను, శంకర్‌రెడ్డి, షఫీ, మునెయ్య, వాసు, నారాయణ పాల్గొన్నారు.

సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేయాలి

మైదుకూరు : సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేయాల్సిందేనని ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మైదుకూరు జెడ్పీ హైస్కూల్ వద్ద గురువారం యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణరెడ్డి, తవ్వా ఓబుళరెడ్డి, వనమాల రాము, గంగులయ్య, రామ్ నాయక్, గురయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గ శ్రేయస్సుకు పోరాటాలే శరణ్యం

బద్వేలు అర్బన్ : కార్మికవర్గ శ్రేయస్సుకు పోరాటాలే శరణ్యమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డిలు తెలిపారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకుని గురువారం ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మేడే సందర్భంగా జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగుమస్తాన్, ఏరియా కార్యదర్శి పి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంతో పాటు పలు చోట్ల సీఐటీయూ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీను, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.నాగేంద్రబాబులు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయకుమార్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కలసపాడులో..

కలసపాడు : స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సీపీఎం నాయకులు గురయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వాలు వారి శ్రమకు తగిన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 5 చోట్ల, సీఐటీయూ ఆధ్వర్యంలో 6 చోట్ల ఎర్ర జండా ఎగురవేసి మే డే ఉత్సవాలు నిర్వహించారు. యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జండా ఎగురవేసి మే డే నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి. రమణారెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు పోరాడి సాధించుకున్న హక్కులను పాలక ప్రభుత్వాలు కాల రాస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీపీఐ, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు. అలాగే యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మండల కార్యదర్శి ఈశ్వర రావు జండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.

అట్లూరు : స్థానిక క్రాస్ రోడ్డు, దేవనగర్, కమలకూరు బీసీకాలనీ, కమలకూరులో సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటూ కార్మిక చట్టాలను మార్చుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, మహిళా కార్మికులు,



ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



బద్వేలులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న నాయకులు



కలసపాడులో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు



పోరుమామిళ్లలో ఏఐటీమూసీ ఆధ్వర్యంలో మే డే వేడుకలు

రాష్ట్రానికి నిధుల కేటాయింపుపై నిర్దిష్ట ప్రకటన చేయాలి

బద్వేలు అర్బన్ : గతంలో అమరావతి శంకుస్థాపనకు వచ్చి చెంబుడు నీళ్ళు, గుప్పెడు మట్టి ఇచ్చిపోయిన మోదీ తిరిగి అమరావతి పునఃప్రారంభానికి వస్తున్న నేపథ్యంలో రాష్ట్రానికి నిధుల కేటాయింపుపై నిర్దిష్ట ప్రకటన చేయడంతో పాటు కడప జిల్లా ఉక్కు పరిశ్రమపై మాట్లాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. మాజీ విద్యార్థి సంఘం నాయకుడు తిరుమలకొండయ్యతో పాటు 70 మంది యువత సీపీఐలో చేరిన సందర్భంగా గురువారం స్థానిక సీపీఐ కార్యాలయం జెవీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా విద్యార్థులను, యువతను మోసం చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి, యువజన విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు పి.వెంకటరమణ, పి.వి.రమణ, నాగేష్, వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

బద్వేలు అర్బన్ : కష్టపడి చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వర్‌రెడ్డిలు తెలిపారు. ఎస్టీయూ బద్వేలు మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఇటీవల వెలువడిన పది ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు

ప్రభుత్వాలు ఏవైనా, పాలకులు ఎవరైనా విద్యారంగ శ్రేయస్సు, సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. 12వ పీఆర్సీని నియమించి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, అదేవిధంగా 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో ప్రకటించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ఎంఈఓ చెన్నయ్య, ఎస్టీయూ రాష్ట్ర కమిటీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, కో కన్వీనర్ వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పద్మనాభరావు, రామసుబ్బయ్య, రీజనల్ కన్వీనర్ సుబ్బరాయుడు, కో కన్వీనర్ వెంకటసుబ్బయ్య, సీనియర్ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సరస్వతీ మాతాజీ

ప్రొద్దుటూరు : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని శివదర్శనానంద సరస్వతీ మాతాజీ అన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీ సాయికుటీర్ రోడ్డులో ఉన్న గౌతం హైస్కూల్ ప్రాంగణంలో శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ వరకు జరిగే ఆధ్యాత్మిక, భక్తి ప్రవచనాల కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి శివదర్శనానంద సరస్వతీ మాతాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా శివదర్శనానంద సరస్వతీ మాతాజీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ నిత్యం ఎన్నో ఒడిదుడుకులు, మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గౌతం విద్యాసంస్థల చైర్మన్ సుధీర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్ల చట్టాలను రద్దుచేయాలి

కడప ఎడ్యుకేషన్: కార్మికుల హక్కులను కాల రాసే నల్ల చట్టాలను రద్దు చేయాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. కడప యూటీఎఫ్ కార్యాలయం వద్ద మేడే సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 10 గంటలు, 12 గంటలు మరియు 14 గంటలు పని చేయాలని కార్మికులపై నల్ల చట్టాలను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. కార్పొరేట్లకు మేలు జరిగే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. నరసింహారావు, సీవీ. రమణ, ఏజాస్‌అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రూతు ఆరోగ్యమేరీ, కృష్ణారెడ్డి, గోపీనాథ్, చంద్రశేఖర్, కేదార్‌నాథ్, శివశంకర్ పాల్గొన్నారు.

సీపీఎం నుంచి బహిష్కరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని భగత్ సింగ్ నగర్‌కు చెందిన పాపిరెడ్డిని సీపీఎం పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ కడప నగర కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాపిరెడ్డి గత కొంతకాలంగా పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. పార్టీ నాయకులను గౌరవం లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడడం, ఆస్తుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కొద్ది రోజులుగా పార్టీ మందలించిందని తెలిపారు. అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో నోటీసులు ఇచ్చి బహిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, కుమారస్వామిరెడ్డి పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగర శివారులోని ఊటుకూరు లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం స్వామి, అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ గోసుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మూల విరాట్‌కు పంచామృత అభిషేకం, కుంకుమార్చన తోపాటు పలు రకాల పూజలు జరిపారు. ఉదయం 11 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం ఘనంగా జరిపారు. మధ్యాహ్నం అన్నదానం జరిపి రాత్రి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఎంపీకి ఆహ్వానం



ఎంపీ అవినాష్‌రెడ్డికి ఆహ్వాన పత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

ఖాజీపేట : మండలంలోని నాగసానిపల్లెలో నూతనంగా మారెమ్మ తల్లి ఆలయం నిర్మించారు. ఈ నెల 18న ఆలయంలో జరిగే అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు రావాలని ఎంపీ అవినాష్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సుధాకర్ గురువారం ఆహ్వానించారు.

దేవాలయాలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి



చాపాడు : వైకుంఠ ఏకాదశి రోజున తిరుమలలో ఆరుగురు భక్తులు మృతి చెందిన విషయం మరువకముందే సింహాచలంలో ఏడుగురు భక్తులు దుర్మరణం చెందడం చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ 70 అగుడుల పొడవు గోడను పిల్లర్లు లేకుండా రెండు రోజుల క్రితం కట్టడం, దాని పక్కనే క్యూ లైన్ పెట్టడమే ఈ ఘటనకు కారణమని వివరించారు. గోదావరి పుష్కరాల్లో 29 మంది మృతి చెందినా, వైకుంఠ ఏకాదశి వేళ తిరుమల తొక్కిసలాటలో ఆరుగురు, సింహాచలంలో ఏడుగురు మృతి చెందడం వెనుక సర్కారు వైఫల్యం కనిపిస్తోందన్నారు. గోడను కాంక్రీట్‌తో కాకుండా ప్లేయాష్ ఇటుకలతో నిర్మించడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కూటమి నిర్లక్ష్యం కప్పిపుచ్చుకొనేందుకు వైఎస్సార్‌సీపీ అధినేతపై విమర్శలు చేయడం పరిపాటిగా మారిందని రెడ్యం మండిపడ్డారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల : పట్టణంలో ప్రముఖ వైద్యులు, పూజా హాస్పిటల్ అధినేత కొమ్మినేని షెనాయ్, డాక్టర్ లతాదేవి దంపతుల కూతురు డాక్టర్ శ్రీపూజ–ప్రేమ్‌కుమార్‌ల వివాహానికి గురువారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సుధ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వారి వెంట విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డి, నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, జడ్పీటీసీలు ముత్యాల ప్రసాద్, డి. సత్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ శారదమ్మ, సర్పంచులు రమణారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షుడు రాజీవ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్



జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పిస్తున్న శివశంకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ తెలిపారు. స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీషు ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తక, పత్రిక పఠనం చేసి జ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. సమ్మర్ క్యాంప్ తరగతుల వివరాలను గ్రంథాలయ అధికారి టి.తిరుపతమ్మను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు విజ్ఞానం అవసరం

చాపాడు : విద్యార్థులకు చదువుతోపాటు విజ్ఞానం అవసరమని గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నాలుగో రోజున ఆదివారం జనరల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు సామాజిక అంశాలపై అవగాహన అవసరమని, చదువుపై పట్టు సడలకుండా వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించడం జరుగుతోందన్నారు.